క్లుప్తంగా

శ్వేత వారాహి హోమం



శ్వేత వారాహి హోమాన్ని నిర్వహిస్తున్న అక్షయ పాత్ర సేవకులు

అమలాపురం టౌన్: లోక కల్యాణార్థం శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్‌నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో నిర్వహిస్తున్న వారాహి షోడశ రాత్రి మహోత్సవాల్లో భాగంగా 12వ రోజు శుక్రవారం శ్వేత వారాహి హోమం వైభవంగా జరిగింది. శ్వేత వారాహిని తెలుపు, నలుపు వర్ణం కలిగిన హోమ ద్రవ్యాలతో ఆహూతులను సమర్పించారు. అన్నం, అటుకులు, ఆవాలు తదితర ఆహూతులను హోమంలో వేసి ప్రజ్వలింపజేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మామిడి పండ్లతో అభిషేకించారు. అక్షయ పాత్ర ప్రతినిధి పోతురాజు రామకృష్ణారావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ షోడశ రాత్రి మహోత్సవాల్లో నాగకనకదుర్గ, శిరీష, తూము దొరబాబు, గొవ్వాల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలసిన విద్యుత్ శాఖ ఏఈ



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఈ చినబాబు

అల్లవరం: స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఏఈగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన చినబాబు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను గోడిలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందించారు. ఏఈగా బాధ్యతలు స్వీకరించిన చినబాబుకి ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన సూర్యనారాయణ, లైన్‌మెన్‌లు ఉన్నారు.

ఉన్నత విద్యకు ప్రభుత్వం చేయూత



సదస్సులో పాల్గొన్న అతిథులు

కాట్రేనికోన: ఉన్నత విద్యకు ప్రభుత్వం చేయూత అందిస్తుందని మద్రాస్ ఐఐటీ పూర్వపు విద్యార్థి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) సభ్యుడు గౌతమ్ అన్నారు. చెయ్యేరు శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ అధ్యక్షతన ఉన్నత విద్య-ప్రభుత్వం అందిస్తున్న చేయూతపై ఒకరోజు సెమినార్ జరిగింది. దీనిని కాకినాడ జేఎన్టీయూ బయో టెక్నాలజీ అండ్ ఫుడ్ టెక్నాలజీ నిపుణుడు ఎం.రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధన ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ వీఎస్ పరమేశ్వరరావు, కళాశాల విద్యాశాఖాధిపతి ఎస్.జయలక్ష్మి, రత్నంరాజు, కళాశాల యాజమాన్య సభ్యులు రమేష్‌రాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తీరని లోటు

తాళ్లరేవు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలాన్ని వాడవాడలా విస్తరింపజేసిన చైతన్య గాయకుడు సాయిచంద్ ఆకస్మిక మృతి తీరని లోటని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ యడ్ల కుటుంబరావు అన్నారు. తాళ్లరేవులోని ప్రజా సంఘాల భవనంలో సాయిచంద్‌ను స్మరించుకుంటూ ఆయన పాటలను పాడి నివాళులు అర్పించారు. మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్, కోఆర్డినేటర్ రెడ్డి గిరిబాబు, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, దడాల రామకృష్ణ, తాడి షణ్ముఖరావు తదితరులు సంతాపం తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి నేడు పరీక్ష

అల్లవరం: గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో 2023-24 విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు శనివారం ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని సూచించారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఏబీవీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు.

అందివచ్చి.. అన్నీ ఇచ్చి..

- సేవకు చిరునామాలు సచివాలయాలు
- ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన



అమలాపురం అశోక్‌నగర్‌లో వార్డు సచివాలయం

అమలాపురం టౌన్: గ్రామ స్వరాజ్యం.. ఈ మాట పుస్తకాల్లో చదవడం, ప్రసంగాల్లో వినడం తప్ప వాస్తవిక పరిస్థితుల్లో ఎప్పుడూ చూడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాలతో ఇంటి ముంగిటకే పాలన వచ్చింది. తద్వారా అసలైన గ్రామ స్వరాజ్యాన్ని కళ్ల ముందే చూస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. సచివాలయాలంటే సేవలకు చిరునామాలుగా మారాయి. అమలాపురం మున్సిపాలిటీలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో 30 వార్డులకు చెందిన 53 వేల మంది జనాభాకు ఇళ్ల వద్ద నుంచి ప్రభుత్వానికి సంబంధించి అన్నీ సేవలు అందే వెసులుబాటు కలిగింది. ఆయా వార్డుల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 129 మంది కార్యదర్శులు, 274 మంది వలంటీర్లు పట్టణ ప్రజలకు నిత్యం పథకాల పరంగా సేవలు అందిస్తూనే ఉన్నారు.

అమలాపురం పట్టణంలో ఇలా..

- వార్డు సచివాలయాలు: 15
- నాలుగేళ్లలో వివిధ పథకాల లబ్ధిదారులు: 22,150
- పథకాలతో అందిన లబ్ధి: రూ.204.96 కోట్లు
- సామాజిక పింఛన్లు: 4,636 మంది
- నాలుగేళ్లలో పింఛన్‌దారులకు లబ్ధి: రూ.52.13 కోట్లు
- జగనన్న అమ్మ ఒడి లబ్ధిదారులు: 3,527
- నాలుగేళ్లలో అందుకున్న లబ్ధి: రూ.5.23 కోట్లు
- వైఎస్సార్ వాహనమిత్ర లబ్ధిదారులు: 162
- నాలుగేళ్లలో చేకూరిన లబ్ధి: రూ.14.31 లక్షలు
- వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు: 1,413
- నాలుగేళ్లలో అందుకున్న లబ్ధి: రూ.2.64 కోట్లు
- వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు: 6,220
- నాలుగేళ్లలో చేకూరిన లబ్ధి: రూ.6.60 కోట్లు
- జగనన్న చేదోడు లబ్ధిదారులు: 315
- అందుకున్న లబ్ధి: రూ.30.42 లక్షలు
- జగనన్న తోడు లబ్ధిదారులు: 1087
- అందుకున్న లబ్ధి: రూ.1.05 కోట్లు
- జగనన్న విద్యా, వసతి దీవెన: 971
- అందుకున్న లబ్ధి: రూ.95.39 లక్షలు

అందుతున్న సేవలెన్నో..

స్థానికంగా ఉన్న 15 వార్డు సచివాలయాల పరిధిలో 274 మంది వలంటీర్లు అందిస్తున్న సేవలు వర్ణనాతీతం. ప్రతి నెలా 1న తెలవారుతుండగానే అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగుల ఇంటి తలుపులు తట్టి సామాజిక పింఛను సొమ్ము చేతిలో పెట్టడంతో ఆ లబ్ధిదారుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రతి నెలా చౌక డిపోకు వెళ్లి వరుసలో నిలబడి రేషన్ సరకులు తీసుకునే అసౌర్యానికి చరమగీతం పాడి ఇంటి వద్దకే రేషన్ బండి వచ్చేలా వలంటీర్లు పర్యవేక్షిస్తున్నారు. సచివాలయాల ద్వారా నవరత్నాల పథకాలకు సంబంధించి పింఛన్, అందరికీ ఇళ్లు, జగనన్న చేదోడు, చేయూత, పెన్షన్ కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, రీసర్వే ఇలా చెప్పుకొంటూ పోతే దాదాపు వందకు పైగా సేవలు అందుతున్నాయి.

వ్యవస్థ బాగుంది



వార్డు సచివాలయ వ్యవస్థ వచ్చాక అన్ని ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే వస్తున్నాయి. మా ఇంటికి ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీరు వచ్చి పింఛను సొమ్ము ఇస్తోంది. సచివాలయాలు, వలంటీర్లు లేక ముందు ఏ అవసరం వచ్చినా తహసీల్దార్, వీఆర్వో కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల వ్యవస్థ బాగుంది.

–గుత్తుల అనంతలక్ష్మి, 15వ వార్డు

సేవలు అభినందనీయం



ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హుల ఇళ్లకు వలంటీర్లు వచ్చి ఆధార్ కార్డు జిరాక్సు తీసుకుని వారే దరఖాస్తు చేయిస్తున్నారు. వారి ద్వారా అన్ని ప్రభుత్వ సేవలూ అందుబాటులో రావడంతో ఇబ్బందులు తప్పాయి. వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం.

–పాటి వెంకటలక్ష్మి, సూర్యనగర్, అమలాపురం

గుమ్మం దాటకుండానే..



వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రభుత్వ పాలన ఇంటి వద్దకే వచ్చింది. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం లబ్ధిదారుడికి చేరేందుకు అనేక డబ్బులు పోసి తహసీల్దార్ కార్యాలయాలకు పదే పదే తిరిగాల్సిన వచ్చేది. ఇప్పుడు లబ్ధిదారుడు ఇంటి గుమ్మం దాటకుండానే సేవలు అందుతున్నాయి.

–మెండు ఇజ్రాయిల్‌రాజు, 14వ వార్డు, విత్తనాలవారి కాల్వ గట్టు

పథకాల అమలులో సరికొత్త చరిత్ర

- మండలంలో ప్రారంభోత్సవాల సందడి
- హాజరైన ప్రజాప్రతినిధులు



పశువుల్లంకలో కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, డీసీసీబీ చైర్మన్ వీర్రాజు

ఐ.పోలవరం: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలో పలు ప్రారంభోత్సవాలతో పండగ వాతావరణం నెలకొంది. మురమళ్ల పీఏసీఎస్ ఆవరణలో రూ.25 లక్షలతో గొడౌన్స్, పశువుల్లంకలో రూ.34 లక్షల సీఎస్ఆర్ (ఓఎన్జీసీ) నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్, రెండు కమ్యూనిటీ భవనాలను జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరై వాటిని ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. తొలుత మురమళ్ల వీరేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు వారికి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. పశువుల్లంకలో బాబూ జగ్జీవన్‌రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. వీరి వెంట పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ధూళిపూడి చక్రం, సుంకర నాగబాబు, కాశే రాజుబాబు, కడియం తమ్మయ్య, మెండా వెంకన్నబాబు, పెమ్మాడి బాబూరావు, కాటం సత్తిరాజు, బీహెచ్ బులిరాజు, ఈశ్వరిభాయి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- చొల్లంగిలో గడప గడపకూ..



చొల్లంగిలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చొల్లంగి పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బూరెల సూర్య ప్రభావతి, బూరెల వెంకట్రాజు, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. పలుచోట్ల మహిళలు ఎమ్మెల్యేకు హారతులిచ్చి స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, నాయకులు బి.వెంకట్రాజు, కాపవరపు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న సురక్ష' సదస్సులు

అల్లవరం: మండలంలోని అన్ని సచివాలయాల వద్ద శనివారం నుంచి ఈ నెల 27 వరకూ జగనన్న సురక్ష సదస్సులు నిర్వహిస్తామని ఎంపీడీఓ కృష్ణమోహన్ శుక్రవారం తెలిపారు. తాను, తహసీల్దార్ ఆధ్వర్యంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రెండు బృందాలుగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులకు కావాల్సిన పత్రాలను ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా అందిస్తామని తెలిపారు. శనివారం తాడికోన, గూడాల గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



వాటర్ వర్క్స్‌లో తాగునీటి సరఫరాపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: పట్టణంలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వాటర్ వర్క్స్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానికంగా తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ఈ నెల 27న జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేసిన క్రమంలో ఎమ్మెల్సీ మున్సిపల్ వాటర్ వర్క్స్ విభాగాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వచ్చీ రాగానే తాగునీటి సరఫరాకు సంబంధించిన డ్రైవర్ల అటెండెన్స్‌ను పరిశీలించారు. కొందరు డ్రైవర్లు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్న విషయాన్ని గమనించారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు బాగోకపోతే తక్షణమే విధుల నుంచి తొలగించాలని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి ఎమ్మెల్సీ సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వద్ద ఓ డ్రైవర్ ఉన్నప్పటికీ వాటర్ వర్క్స్ నుంచి మరో డ్రైవర్‌ను విధులకు పంపించడం వల్ల తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతోందని అన్నారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించడం అభినందనీయమని, అయితే ఆ ట్యాంకర్లను నడిపేందుకు డ్రైవర్లు ఉన్నా పూర్తిస్థాయిలో ఉపయోగించుకోని తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న ఈడబ్ల్యూఎస్ కాలనీలో తాగునీటి సమస్యలు ఉండడం వల్ల ఆ కాలనీ వాసుల నుంచి కొందరు రోడ్డెక్కిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. ఇకపై ఇలాంటి సమస్య రాకూడదని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, బండారు గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకులు యండమూరి శ్రీను, కుడుపూడి త్రినాథ్ తదితరులు ఎమ్మెల్సీ వెంట ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లి గ్రామ దేవత వనువులమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక, కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ అందరికీ కనిపించేలా ఎదురుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ డిపో ఆవరణలో యూనియన్ కార్యాలయాల కోసం కొంత స్థలం కేటాయించాలని ఆయా యూనియన్ల, ఆటో యూనియన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలసి విన్నవించారు. దీంతో ఆయన స్వయంగా ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు, డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తదితరులతో కలసి పరిశీలించారు. అవసరమైతే డిపో ఎదురుగా ఉన్న కొన్ని దుకాణాలు తొలగించి మెయిన్ గేట్ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేయాలని, యూనియన్లకు స్థలాన్ని చూడాలని మంత్రి సూచించారు. ఈ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.

నిధులు విడుదల చేయాలి

అల్లవరం: పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని అల్లవరం సర్పంచుల సమాఖ్య శుక్రవారం తీర్మానించింది. స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. సర్పంచులు దాకారపు చిరంజీవిరావు, మల్లాడి మంగాయమ్మ, రాయుడు విష్ణు, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, సాధనాల సూర్య నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం

తాళ్లరేవు: వినికిడి లోపంతో సతమతమవుతున్న పేద విద్యార్థి తుమ్మూరి నవీన్‌కు తాళ్లరేవు డైమండ్ గ్రూప్ సభ్యులు రూ.16 వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక లయన్స్ క్లబ్ సమావేశ భవనంలో నవీన్‌కు లయన్స్ క్లబ్ ప్రతినిధి డీవీఎస్ రాజు నగదును అందజేశారు. డైమండ్ గ్రూప్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, వాడ్రేవు వీరబాబు, పొన్నాడ పేరయ్యరాజు, సామా భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి అమ్మవారు



తాళ్లరేవులో కూరగాయల అలంకరణలో కనకదుర్గమ్మ వారు

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ వారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూసారపు వాసు, సాయి, పద్మారావు, లోవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న పాల వెల్లువ'తో రైతులకు భరోసా

అల్లవరం: దళారీ వ్యవస్థ లేకుండా పాడి రైతులు నేరుగా పాలు విక్రయించుకుని ఆర్థికంగా స్థిరపడాలన్న ఉద్దేశంతో జగనన్న పాల వెల్లువ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సర్పంచ్ లక్ష్మీపతిరాజు అన్నారు. గోడిలంక సచివాలయంలో జగనన్న పాల వెల్లువపై పాడి రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నిర్దేశించిన ధరకు పాలను విక్రయించుకోవచ్చని తెలిపారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఏపీఎం సయ్యద్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

భవనాన్ని అందుబాటులోకి తేవాలి

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని బాలికల హాస్టల్ భవనానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భవనం శిథిలస్థితికి చేరకుండా ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలన్నారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

ముమ్మిడివరం: చట్టాలు, దిశ యాప్‌పై మహిళలు మరింత అవగాహన పెంచుకోవాలని దిశ డీఎస్పీ ఎస్.మురళీమోహన్ సూచించారు. స్థానిక తారా కళాశాలలో గురువారం సీఐ ఎస్.కొండయ్య అధ్యక్షతన దిశ యాప్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రభుత్వం ఎన్నో చట్టాలు తీసుకు వచ్చిందన్నారు. మహిళలు, విద్యార్థులు ఆపద వచ్చినప్పుడు 100, 112 నంబర్లకు ఫోన్ చేస్తే పోలీసుల నుంచి రక్షణ పొందుతారన్నారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు, యువతలకు, మహిళలకు దిశయాప్, దిశ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. దిశా ఎస్సై కె.శంకర్, దిశ మహిళా ఎస్సై కనకదుర్గ, ముమ్మిడివరం ఎస్సై కె.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఊర చెరువు పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా భీమనపల్లి ఊరచెరువు పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపాధి కూలీలతో చేపట్టిన ఈ పనులను శుక్రవారం సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. రూ.8 లక్షలతో ఉపాధి కూలీల ద్వారా చెరువును ఆధునీకరిస్తున్నట్లు ఉపాధి ఏపీఓ రాజామణి తెలిపారు.